క్లుప్తంగా

రైతులకు మేలు చేకూరేలా సదస్సులు

మునగపాక: రైతులకు మేలు చేకూరేలా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని రామభద్రపురంలో మంగళవారం రీసర్వేకు సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ–సర్వేలోని లోపాలను సవరించేందుకు సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. రైతుల భూములకు సంబంధించిన వివాదాలు, సరిహద్దు గొడవలు పరిష్కారం అవుతాయన్నారు. రీ–సర్వే డీటీ పడాల్, ఆర్ఐ కిషోర్, పలువురు రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ సూర్యచంద్రరావు

మునగపాక: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు కోరారు. హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, వెలగా మురళి, విల్లూరి నూక నరసింగరావు, దాడి అప్పలనాయుడు, బుద్ద వెంకట్, భీమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ప్రారంభం

కోటవురట్ల: మండలంలో మంగళవారం ఉచిత ఇసుక పాలసీని తహసీల్దారు తిరుమలబాబు ప్రారంభించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఉచిత ఇసుక తరలింపు కోసం జీపీఎస్ అమర్చిన ట్రాక్టర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని వరాహనదిలో కైలాసపట్నం, గొట్టివాడ, పందూరు ప్రాంతాలలో ఉచిత ఇసుక తరలింపునకు అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు. రీచ్‌ల వద్ద వీఆర్వోను నియమిస్తున్నామని, ఇంటి నిర్మాణాలకు అనుమతి తీసుకుని, ఇక్కడి నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు. రీచ్‌లో 3 అడుగుల ఎత్తున ఇసుక నిల్వ ఉన్న చోట ఒక అడుగు లోతున తవ్వకాలు జరిపేందుకు అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు.


మునగాకుతో బహుళ ప్రయోజనాలు



మునగాకు ప్రయోజనాలు వివరిస్తున్న సిబ్బంది

నక్కపల్లి: మునగాకుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా రక్తహీనత నివారించవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మంగళవారం నక్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. మునగాకు, తెలగ పిండితో చేసిన పదార్థాలను తినడం వల్ల మంచి పోషక విలువలు లభిస్తాయన్నారు. రక్తహీనత నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, కార్యకర్తలు దుర్గారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్ పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం నుంచి సాయిబాబా గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరైన నిధులతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రహదారుల నిర్మాణంపై దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు.

పల్లె పండగ.. సర్పంచ్‌లకు గుదిబండ!



ఉపాధి హామీ పథకం ద్వారా 75 శాతం నిధుల కేటాయింపు
మిగతా 25 శాతం పంచాయతీలు భరించాలంటూ జీవో విడుదల

- తొలి విడతగా 9 పంచాయతీల్లో రూ.1.60 కోట్ల నిధుల కేటాయింపు
- పంచాయతీలపై అదనపు భారం రూ.40 లక్షలు
- తాము భరించేది లేదంటున్న సర్పంచ్‌లు

గ్రామాలకు మహర్దశ తీసుకొస్తామని కూటమి ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే నిధుల విడుదల విషయంలో చేతులు ఎత్తేయడంతో ఇప్పుడు పంచాయతీలపై ఆ భారం పడుతోంది. అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకం కింద 75 శాతం నిధులు కేటాయించగా.. మిగతా 25 శాతం సర్పంచులే భరించాలంటూ జీవో విడుదల చేయడంపై అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ప్రజలు నేరుగా ఎన్నుకోబడిన సర్పంచులను పక్కన పెట్టి ఆయా గ్రామాల్లోని కూటమి నేతలు ఈ పనులపై పెత్తనం చెలాయించడం వివాదాస్పదమవుతోంది. తమను ఉత్సవ విగ్రహాలుగా చూస్తే సహించేది లేదంటూ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రహదారులు, కాలువలు నిర్మించేందుకు వీలుగా పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకు కోసం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా తీర్మానాలు చేయించారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంత వరకు బాగానే ఉంది. పనులు చేసేది మాత్రం సర్పంచ్‌లు కాకుండా కూటమికి చెందిన నాయకులకు అవకాశం కల్పించడం వివాదాస్పదమవుతోంది. కొన్ని చోట్ల సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా భూమి పూజలు సైతం చేసేశారు. నిధులు పంచాయతీవి.. పెత్తనం కూటమి నేతలదా అంటూ సర్పంచులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



మునగపాక పంచాయతీ కార్యాలయం

పల్లె పండగలో అభివృద్ధికి నిధులు ఇలా..

పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా చేపట్టే రహదారులు, కాలువల నిర్మాణాలకు నిధుల కేటాయింపు సర్పంచ్‌లకు ఆగ్రహం తెప్పిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 75 శాతం నిధులు, పంచాయతీ ద్వారా 25 శాతం నిధులను ఖర్చు చేయాలని ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. దీంతో ఇప్పటికే పంచాయతీలకు అరకొర నిధులు వస్తుంటే 25 శాతం నిధులు ఎలా ఇవ్వగలమంటూ సర్పంచులు నిరసన గళమెత్తారు. మైనర్ పంచాయతీల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటున్న తరుణంలో 25 శాతం ఇచ్చేస్తే ఏడాది పాటు పంచాయతీ నిర్వహణ పరిస్థితులు ఎలా అంటూ సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీల నుంచి నిధుల కేటాయింపు కష్టతరమేనని, ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు.

పంచాయతీలకు అదనపు భారం ఇలా...

పంచాయతీ	నిధుల కేటాయింపు	భారం
మెలిపాక	రూ.16లక్షలు	రూ.4లక్షలు
గణపర్తి	రూ.15లక్షలు	రూ.3.75లక్షలు
చూచుకొండ	రూ.32లక్షలు	రూ.8లక్షలు
వాడ్రాపల్లి	రూ.8.50లక్షలు	రూ.2.12లక్షలు
తిమ్మరాజుపేట	రూ.10లక్షలు	రూ.2.5లక్షలు
నాగులాపల్లి	రూ.36లక్షలు	రూ.9లక్షలు
గొల్లలపాలెం	రూ.5లక్షలు	రూ.1.25లక్ష
ఒంపోలు	రూ.21లక్షలు	రూ.5.25లక్షలు
ఉమ్మలాడ	రూ.15లక్షలు	రూ.3.75లక్షలు

9 పంచాయతీల్లో రూ.1.60 కోట్లతో పనులు

మండలంలోని 26 పంచాయతీలకు తొలి విడతగా 9 పంచాయతీల్లో పల్లె పండగలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఇందుకోసం రూ.1.60 కోట్ల మేర నిధులు కేటాయించారు. ఆయా పంచాయతీల్లో ఇప్పటికే రహదారులు, కాలువల నిర్మాణాలకు భూమి పూజలు సైతం చేశారు. 5.6 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి చర్యలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్దేశించింది.



పంచాయతీల నుంచి 25 శాతం నిధుల కేటాయింపునకు సంబంధించి మినహాయింపు కోరుతూ ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న మునగపాక మండలంలోని సర్పంచ్‌లు

ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లు!

రాష్ట్రంలో మెజార్టీ సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడంతో ప్రభుత్వం కూటమి నేతలకు పల్లె పండగ పనులు అప్పగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆయా పంచాయతీల్లో సర్పంచ్‌ల ద్వారా కాకుండా కూటమికి చెందిన వ్యక్తుల ద్వారా పనులు చేయించేలా నిర్ణయం తీసుకుంది. దీంతో సర్పంచ్‌లు ఆగ్రహంతో ఉన్నారు. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా చూపడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తుందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఇబ్బందికరంగా 25 శాతం జీవో



గ్రామాల్లో సర్పంచ్‌లు రాజకీయాలకు అతీతంగా గ్రామసభలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. అయితే పంచాయతీ నుంచి 25 శాతం మేర నిధులు ఖర్చు చేసేలా విడుదల చేసిన జీవో ఇబ్బందికరంగా ఉంది. పంచాయతీలపై భారం లేకుండా నేరుగా ఉపాధి హామీ పథకం ద్వారా శత శాతం పనులు జరిగేలా చూడాలి. లేకుంటే మైనర్ పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది.
– కాండ్రేగుల నూకరాజు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు

సర్పంచ్‌లకు గౌరవమివ్వాలి..



సర్పంచ్‌లను కాదని గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి ఇతరుల పెత్తనం సరికాదు. ఎవరో పని చేయడం.. తాము పంచాయతీ నుంచి 25 శాతం మేర నిధులు సమకూర్చడం సరైన పద్ధతి కాదు. సర్పంచ్‌లకు తగిన గౌరవం అందిస్తూ తమ ద్వారానే అభివృద్ధి పనులు జరిపించేలా చూడాలి.
– సుందరపు తాతాజీ, సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి

పూర్తి గైడ్‌లైన్స్ రాలేదు..



పల్లె పండగ కార్యక్రమానికి సంబంధించి గైడ్ లైన్స్ పూర్తిగా రాలేదు. అయితే 75 శాతం ఉపాధి హామీ, మిగిలిన 25 శాతం పంచాయతీల ద్వారా పనులు చేయించేలా విధానం ఖరారు చేశారు. పంచాయతీలపై భారం లేకుండా అదనంగా నిధులు కేటాయించే అవకాశం ఉంటుందని చెప్పగలం. ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించి విధి విధానాలు వచ్చే అవకాశం లేకపోలేదు.
– ఎం.ఉషారాణి, ఎంపీడీవో

అక్రమాలపై రికవరీ చేపడతాం


- ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి
- కోటవురట్లలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక



ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న పీడీ పూర్ణిమాదేవి

కోటవురట్ల: సామాజిక తనిఖీలలో గుర్తించిన అక్రమాలపై సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తామని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి తెలిపారు. మండలంలోని 25 పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. డీఆర్‌పీలు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను పంచాయతీల వారీగా వినిపించారు. ఎక్కువగా మస్తర్లలో సంతకాలు, వేలిముద్రలు లేకపోవడం, జగనన్న కాలనీల్లో ఇళ్లకు బదులు షాపులు, రెండే ఫ్లోర్లు నిర్మించడం, చనిపోయిన వ్యక్తుల పేరున మస్తర్లు వేయడం, వలంటీర్లు నిబంధనల ప్రకారం వారానికి మూడు రోజులు పని చేయాల్సి ఉండగా 5 రోజులు పని చేసినట్టుగా గుర్తించడం వంటి అంశాలు వెలుగు చూశాయి. పలు ప్రాంతాలలో పనికి సంబంధించి సమాచార బోర్డులు ఏర్పాటు చేయలేదని గుర్తించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 1467 పనులకు గాను, కూలీ రూపంలో రూ.17.50 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.4.60 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి జరిపిన సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై డీఆర్‌పీలు పలు వివరాలు నమోదు చేశారన్నారు. గుర్తించిన అక్రమాలపై రికవరీ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, సహాయ పథక సంచాలకుడు బి.శ్రీనివాస్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ దివ్య, స్టేట్ రీసోర్స్ పర్సన్స్ రాజేంద్ర, నాగరాజు, ఏపీవోలు నాగరాజు, గంగునాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మండలంలోని మూలపేటలో మంగళవారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి పనులను గుర్తించడంతో పాటు పశువుల షెడ్లు, గడ్డి పెంపకంపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, ఆడారి అమ్మాజీ, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, నారాయణమూర్తి, శరగడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.


క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి త్రోబాల్ జట్ల ఎంపిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



మట్టి తవ్వకాలకు ఉపయోగించిన పొక్లెయిన్

ఎస్.రాయవరం: వమ్మవరం చెరువులో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ వ్యవహారంపై సీపీఎం మండల నాయకులు రెవెన్యూ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. చెరువుల్లో ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను ఉపయోగించి పెద్ద ఎత్తున తవ్వకాలు చేపడుతుండడంతో సమాచారం తెలుసుకున్న సీపీఎం నాయకుడు సత్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గమనించిన డ్రైవర్లు ట్రాక్టర్లతో సహా పరారయ్యారు. పొక్లెయిన్ మాత్రం చెరువులో ఉంది. ఈ మేరకు స్థానిక వీఆర్వోకు అప్పగించి మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఈ భాను మాట్లాడుతూ చెరువుల్లో అక్రమంగా మట్టి తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

పాయకరావుపేట: ప్రతి రైతు పంటలకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఏడీఏ డి.ఉమాప్రసాద్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం నామవరం, పాయకరావుపేట గ్రామాల్లో రైతులతో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఏవో పి.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈ కె.శ్రీరామమూర్తి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంతకాలు చేసి వెళితే పాలకవర్గం ఎందుకు?

- సభ్యులకు తెలీకుండా అజెండా రూపకల్పనపై కొత్తపాలెం కౌన్సిలర్ సంతోష్ ఆగ్రహం
- ఆదాయం పెరగకపోవడంతో మంజూరు కాని 15వ ఆర్థిక సంఘం నిధులు
- వాడీవేడిగా యలమంచిలి మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ రమాకుమారి



అజెండాపై ప్రశ్నిస్తున్న రాపేటి సంతోష్



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

యలమంచిలి రూరల్: 'అజెండాలో పెడుతున్న అంశాలు సభ్యులకు తెలియదు.. మా వార్డుల్లో ప్రధాన సమస్యల గురించి ఎవరికి చెప్పాలో తెలియదు.. కేవలం రికార్డుల్లో తీర్మానాలు చేసినట్టు సంతకాలు చేసి, టీ, సమోసా తిని వెళ్లిపోవడానికైతే పాలకవర్గం ఎందుకు? ప్రధాన సమస్యలపై ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం'అంటూ మంగళవారం జరిగిన యలమంచిలి మున్సిపల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు రాపేటి సంతోష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ వార్డు పరిధిలో రోడ్లు, పారిశుధ్యం అధ్వానంగా ఉన్నాయని, ప్రజలకు కనీస అవసరాలు కూడా పరిష్కరించలేని పదవులెందుకో అర్థం కావడం లేదని ఆయన మండిపడ్డారు. సమస్యల ప్రస్తావన, మున్సిపాల్టీకి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవడం, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం.. వెరసి మంగళవారం పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన 47వ పాలకవర్గ సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన ఉదయం 11.20 గంటలకు ప్రారంభమైన సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 13 అంశాలు, అత్యవసర సమావేశం అజెండాలో పెట్టిన 6 అంశాలపై స్వల్పకాలిక చర్చ చేపట్టారు. పట్టణంలో పెరిగిన కోతుల సంచారం కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్టు చైర్‌పర్సన్ చెప్పారు. ఇందు కోసం ప్రాథమికంగా 260 కోతులను పట్టి వాటికి ఆహారం, రవాణా సౌకర్యం కల్పించి అడవిలో దూరంగా విడిచిపెట్టడానికి ఒక్కో కోతికి రూ.1050 చొప్పున రూ.2.73 లక్షలు ఖర్చవుతుందని సమావేశంలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు యలమంచిలి మున్సిపాలిటీకి మంజూరు కాలేదని, ఇది చాలా బాధాకరమని చైర్‌పర్సన్ అభిప్రాయపడ్డారు. ఎందుకు మంజూరు కాలేదో కారణాలు వివరించాలని కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజును ఆమె కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన ప్రమాణాలు చేరుకోకపోవడమే ప్రధాన కారణంగా ఆయన చెప్పారు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి సహా ఇతర పన్నుల వసూళ్లకు సంబంధించి వెనుకబడడమే ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవడానికి కారణంగా ఆయన చెప్పారు.

ఆదాయం పెంపునకు చర్యలు అవసరం

పురపాలక సంఘం ఆదాయం పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఇందు కోసం ఆస్తి పన్ను వసూళ్లను శతశాతం పూర్తి చేయడంతో పాటు పురపాలక సంఘం పరిధిలో ఆస్తి పన్ను విధించని ఇళ్లను గుర్తించి వసూలు చేయాలని చైర్‌పర్సన్ సూచించారు. ఇటీవల ఇంటింటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు కోసం చేపట్టిన సర్వేలో 484 ఇళ్లకు ఆస్తి పన్ను విధించలేదని గుర్తించినట్టు కమిషనర్ తెలిపారు. వాటికి పన్ను విధించడానికి యజమానుల వద్ద సరైన పత్రాలు లేవని చెప్పారు. దీని కోసం అవసరమైన కసరత్తు చేయాలని సభ్యులు కోరారు. పారిశుధ్యం మెరుగుకు సంబంధించి సిబ్బందిని పర్యవేక్షించే ప్రక్రియ జరగడం లేదన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పారిశుధ్య సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారో గుర్తించేలా ఆధునిక టెక్నాలజీతో ట్రాక్ చేస్తే బాగుంటుందని సభ్యులు, అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ–ఆటోలు వచ్చాక పనితీరు మెరుగు పడాల్సింది పోయి మరింత దిగజారిందని చైర్‌పర్సన్ అన్నారు. కొత్తపాలెంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వార్డు కౌన్సిలర్ రాపేటి సంతోష్ ప్రశ్నించగా.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు చెప్పిన సమాధానం సరిగా లేదని చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.66 లక్షలే మంజూరు కావడంతో వాటితో పనులను మూడు వార్డుల్లోనే ప్రతిపాదించినట్టు ఆమె తెలిపారు. కొమ్మాయిగుండం చెరువు చుట్టూ సుందరీకరణ పనులను పూర్తి చేసేలా చూడాలని వైస్ చైర్మన్ అర్రెపు నాగ సత్య త్రినాథ గుప్తా కోరారు. అజెండాల్లోని 19 అంశాలకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వర్రావు, వార్డు సభ్యులు దూది నర్సింహమూర్తి, సుంకర మరిణేశ్వర్రావు, పిట్టా సత్తిబాబు, మజ్జి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

పాయకరావుపేట: మాసాహేబుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి భర్త శ్రీనివాసరావును మంగళవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు పరామర్శించారు. శ్రీనివాసరావు తల్లి సూర్యకాంతం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మేరకు శ్రీనివాసరావుతో జోగులు మాట్లాడి ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శులు కోడ కోటేశ్వరరావు, యజ్జల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేష్, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు, బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం



వేంపాడు ఆస్పత్రిలో ధన్వంతరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

నక్కపల్లి: ఆయుర్వేద దినోత్సవాన్ని(ధన్వంతరి జయంతి) మంగళవారం వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ బినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద వైద్యాన్ని పిల్లల నుంచి పెద్దల వరకు పొందవచ్చన్నారు. ఆయుర్వేద ఆస్పత్రుల్లో దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయుర్వేద సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది, యోగా టీచర్లు రాంబాబు, సాయి పాల్గొన్నారు.

పాడి పశువుల సంరక్షణ అవసరం

కోటవురట్ల: పాడి పశువుల సంరక్షణలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెట్ల నరేష్ సూచించారు. ఆక్సాహేబుపేటలో మంగళవారం ఉచిత పశు గర్భకోశ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాములవాక పశు వైద్య శాల ఆధ్వర్యంలో నిర్వహించగా.. వైద్యాధికారి డాక్టర్ వి.హరిప్రియ పర్యవేక్షణలో పశువులకు వైద్య సేవలందించారు. ఆమె మాట్లాడుతూ 67 ఎదకు రాని పశువులకు గర్భకోశ చికిత్స, 17 లేగ దూడలకు నట్టల నివారణ మందు వేసినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: పట్టణంలోని టౌన్–3 ఫీడర్ పరిధిలో 33/11కేవీ విద్యుత్ లైన్ల పనులు, 11కేవీ టౌన్–2 ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. యలమంచిలి పట్టణంలో ధర్మవరం, కాకివానివీధి, రామచంద్రమ్మ కాలనీ, కల్కి పెట్రోల్ బంక్, పెంజెరువు రోడ్డు, సోమలింగపాలెం ఆర్‌డబ్ల్యూఎస్, తులసీనగర్, ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీ, ఫైర్ ఆఫీస్ కాలనీలకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. లైన్ల మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.